# సనత్‌నగర్
నియోజకవర్గం

ప్రజల మాట ప్రగతి బాట

8

నమస్తే తెలంగాణ

సోమవారం 23 అక్టోబర్ 2023

ntnews.com


# వ్యాపారులకు.. ఎంతో అనువైన ప్రాంతం

● మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



మర్చంట్స్ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని

అమీర్‌పేట్, అక్టోబర్ 22 : తెలంగాణ ఏర్పడిన తరువాత అంతా అశాంతి, గొడవలే ఉంటాయన్న విపక్షాల విష ప్రచారానికి పూర్తి భిన్నంగా సీఎం కేసీఆర్ తెలంగాణను అత్యద్భుతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దారని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. సాఫ్ట్‌వేర్, వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక, పర్యాటక రంగాల్లో తెలంగాణను అగ్రగామిగా నిలపాలన్న సీఎం కేసీఆర్ సంకల్పం సాకారం దిశగా అడుగులు పడుతున్నాయని తెలిపారు. వ్యాపారవర్గాలకు అనువుగా ఉండే విధంగా తెలంగాణలో శాంతి భద్రతలను అదుపు చేసేందుకు అనుసరించిన విదానాలతో పాటు అందుబాటులోకి తీసుకువచ్చిన ఆధునిక సాంకేతిక పద్ధతులు చక్కటి ఫలితాలిచ్చాయన్నారు. గత పాలనలో నిత్యం గొడవలు, కర్ఫ్యూలతో భయం భయంగా గడిపే నగర వాసులు ఇప్పుడు ప్రశాంతకరమైన వాతావరణానికి అలవాటు పడ్డారన్నారు. దంతా బీఆర్ఎస్ సాధించిన ఘనతేనన్నారు. ఆదివారం అమీర్‌పేట్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులతో పాటు పలువురు పారిశ్రామికవేత్తలతో మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి ఆధ్వర్యంలో హోటల్ ఆదిత్య పార్క్‌లో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి తలసాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారస్థులు గతంలో ఎన్నడూ చూడనంతటి ప్రశాంతకర వాతావరణం ఇప్పుడు తెలంగాణలో నెలకొందని, ఇటువంటి పరిస్థితులు కొనసాగించే సత్తా బీఆర్ఎస్‌కు మాత్రమే ఉందన్నారు.

**దాండియా కోసం చక్కటి వేదికను నిర్మిస్తాం..**

దసరాను పురస్కరించుకుని ఉత్తరాదికి చెందిన వారు దుర్గామాతను ప్రతిష్ఠించుకుని భక్తి శ్రద్ధలతో నిర్వహించే దాండియా ఆటకు అనువైన స్థలాన్ని నిర్మించి ఇస్తానని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉంటూ పని చేయడమే బీఆర్ఎస్ విధానమని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా పెద్దసంఖ్యలో పాల్గొన్న అసోసియేషన్‌కు చెందిన కుటుంబాలు మంత్రి తలసానితో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు తాము డాండియా ఆడుకునేందుకు అనువైన స్థలం లేని కారణంగా తాము నగర శివార్లలోని ఓ కన్వెన్షన్‌ను అద్దెకు తీసుకోవాల్సిన పరిస్థితులున్నాయని మంత్రి దృష్టికి తెచ్చారు. ఇందుకు స్పందించిన మంత్రి అమీర్‌పేట్ డీకే రోడ్డులో ఉన్న గురుగోబింద్‌సింగ్ స్టేడియం ఆవరణలో ఉన్న ఖాళీ ప్రదేశాన్ని డాండియా ఆడుకునేందుకు అనువుగా ఉంటుందని కొందరు చేపిన సూచనకు సానుకూలంగా స్పందించారు. స్టేడియం ఆవరణలో ఓ చక్కటి వేదికను డాండియా ఆడుకునేందుకు వీలుగా నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి నాటికి డీకేరోడ్డులో ఆ మహనీయుని విగ్రహాన్ని ఏర్పాటు చేసేలా చొరవ తీసుకుంటానని మంత్రి తలసాని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉత్తమ్‌కుమార్, గులాబ్‌సింగ్ రాజ్‌పురోహిత్, వ్యాపారవేత్తలు హన్స్‌రాజ్ కొఠారి, సజన్‌లాల్ కొఠారి, ఆనంద్ సోది, పురుషోత్తమ్ మదానా, అశోక్‌సింగ్ పురోహిత్, చైన్‌సింగ్, పియూష్‌గుప్తా, మోహన్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన వ్యాపారులు

## సనత్‌నగర్‌లో బీఆర్ఎస్ గెలుపు ఏకపక్షమే



బీఆర్ఎస్‌లో చేరిన వారితో మంత్రి తలసానివాస్‌యాదవ్

అమీర్‌పేట్, అక్టోబర్ 22: సనత్‌నగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ గెలుపు ఏకపక్షమేనని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూస్తున్న విపక్షాలకు చెందిన నాయకులు బీఆర్ఎస్‌లోకి వస్తున్నారన్నారు. శనివారం రాత్రి సనత్‌నగర్ నెహ్రూపార్కు రోడ్డులో జరిగిన ఓ కార్యక్రమంలో సరిత నేతృత్వంలో బీజేపీకి చెందిన దాదాపు 30 మంది బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. సనత్‌నగర్ డివిజన్‌లో సీనియర్ నాయకురాలిగా పార్టీ నిర్దేశించిన ఎటువంటి కార్యక్రమాలనైనా విజయవంతంగా పూర్తి చేస్తారనే పేరున్న సరిత నిష్క్రమణతో బీజేపీ మరింత ఢీలా పడింది. వీరందరికీ మంత్రి తలసాని కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇదిలా ఉంటే సనత్‌నగర్‌లో చోటు చేసుకున్న అభివృద్ధిని గమనిస్తున్న విపక్షాలకు చెందిన మరింత మంది నాయకులు బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకునేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. గత కొద్ది రోజులుగా బీఆర్ఎస్‌లోకి వలసలు పెరగడంతో డివిజన్‌లో పార్టీ మరింత పటిష్ఠంగా మారింది. కార్పొరేటర్ కొలను లక్ష్మి రెడ్డి, డివిజన్ అధ్యక్షులు కొలను బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానం..



పద్మారావునగర్ స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. రోడ్ల పక్కన ఉంటూ ఆకలితో అలమటించే వృద్ధులను, నిరాశ్రయులకు భోజనం సమకూర్చామని స్కై ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ వై.సంజీవ్ కుమార్, ఉపాధ్యక్షురాలు ఓ.పావని తెలిపారు.

– బన్సీలాల్‌పేట్, అక్టోబర్ 22

# పువ్వులనే దైవంగా పూజించే గొప్ప సంస్కృతి..



జెక్‌కాలనీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



జెక్‌కాలనీలో బతుకమ్మలకు పూజలు నిర్వహిస్తున్న మంత్రి తలసాని



బోయగూడలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

అమీర్‌పేట్/బన్సీలాల్‌పేట్, అక్టోబర్ 22 : అన్ని పూజలకు పువ్వులను వినియోగిస్తారని, అలాంటిది పువ్వులనే దైవంగా పూజించే గొప్ప సంస్కృతి మన తెలంగాణ ఘనత అని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సద్దుల బతుకమ్మ వేడుకలను బన్సీలాల్‌పేట్‌లోని రెడ్‌క్రాస్ మైదానంలో, పద్మారావునగర్‌లోని జీహెచ్‌ఎంసీ పార్కు వద్ద ఘనంగా నిర్వహించారు.

● సనత్‌నగర్ జెక్‌కాలనీ బతుకమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సద్దుల బతుకమ్మ వేడుకలకు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు కాలనీ వాసులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు చింతిరెడ్డి ప్రభ, ప్రధాన కార్యదర్శి ఎస్.అన్నపూర్ణ పర్యవేక్షణలో సంప్రదాయ పద్ధతుల్లో ఉత్తమంగా పేర్చిన బతుకమ్మలకు బహుమతులు అందజేశారు.



బన్సీలాల్‌పేట్‌లో బతుకమ్మ సంబురాలలో పాల్గొన్న కార్పొరేటర్ హేమలత, మహిళలు